క్లుప్తంగా

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



రెంజల్(బోధన్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ సబ్ కలెక్టర్ మహతో సూచించారు. జూపల్లి గ్రామంలో జరుగుతున్న రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని, తప్పులు జరిగితే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి అంజనేయులు, ఇన్చార్జి ఎంపీడీవో రఫీయుద్దీన్ పాల్గొన్నారు.

'పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి'



వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన రామన్నపేట్‌లో సంక్షేమ పథకాల అమలు గురించి ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నేతలు గడ్డం నర్సారెడ్డి, భూమారెడ్డి, రమణ, దామోదర్ గౌడ్, ఆత్మరాం, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలకు ప్రాధాన్యత ఇవ్వాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): రుణాల కోసం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో విశ్వకర్మలకు ప్రాధాన్యత ఇవ్వాలని విశ్వకర్మ మహాసభ జిల్లా నాయకులు మహిపాల్‌చారి ఆధ్వర్యంలో ఎంపీడీవో బ్రహ్మానందానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. విశ్వకర్మలలో అర్హులైన పేదలను గుర్తించి రుణాలు మంజూరు చేయించి ఆర్థిక తోడ్పాటును అందించాలని కోరారు.

పున:ప్రతిష్ఠాపనోత్సవాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): నికాల్‌పూర్‌లో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామ దేవతల విగ్రహాల పున:ప్రతిష్ఠాపనోత్సవాలు జరుగనున్నాయి. గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం కల్పనా సంతోష్ రెడ్డి, ఇతర దాతల సహకారంతో ముత్యాలమ్మ, చిలుకల చిన్నమ్మ, ఇతర దేవతా విగ్రహాలను తయారు చేయించినట్లు వీడీసీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీ వరకు పూజలు జరుగుతాయన్నారు.

తాటి పత్రుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్నకారు రైతులకు తాటి పత్రులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నాయకుడు సంతోష్, మాజీ ఎంపీటీసీ నాయకుడు పద్మ, ముప్కాల్ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిబిరం

బాల్కొండ: కిసాన్‌నగర్‌లో భగవాన్ సత్యానంద మహర్షి గీతా భక్త జనాశ్రమంలో ఈ నెల 11 నుంచి 18 వరకు ఉచిత వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 50 మందికి మాత్రమే శిబిరంలో అవకాశం ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని కేజీబీవీలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కోసం ఆసక్తి గల ఇన్‌స్ట్రక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆహ్లాదం కోసం నృత్యం, సంగీతం, డ్రాయింగ్, యోగ అంశాలలో 15 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా అంశాలపై శిక్షణ నివ్వడానికి ఆసక్తి ఉన్న ఇన్‌స్ట్రక్టర్లు ఆర్మూర్ పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య దరఖాస్తు సమర్పించాలన్నారు. ఈ నెల 10 నుంచి 25వరకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

ఎడపల్లి(బోధన్): ఎమ్మెస్సీ ఫారం, ఎడపల్లి జీపీలో క్షయ వ్యాధి నివారణపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో నాగరాజు క్షయవ్యాధి గురించి అవగాహన కల్పించారు. 35 క్షయవ్యాధి లక్షణాలు గల తెమడలను సేకరించారు. జీపీ సెక్రటరీ రాజు, ఆరోగ్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

రైతు వేదికలకు కరెంటు కష్టాలు..!

- పేరుకుపోయిన విద్యుత్ బిల్లులు
- సరఫరాను నిలిపి వేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

బాల్కొండ: రైతు వేదికలకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. ముప్కాల్ మండలం రెంజర్లలో నాలుగు నెలలుగా విద్యుత్ బిల్లు రూ.3,558 పేరుకు పోవడంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరాఫరాను నిలిపేశారు. దీంతో సోమవారం రైతు వేదికలో జరగాల్సిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం జీపీలో నిర్వహించారు. ముప్కాల్ మండల పరిధిలో ముప్కాల్, రెంజర్లలో, బాల్కొండ మండల పరిధిలో బాల్కొండ, వన్నెల్(బి), మెండోరా మండల పరిధిలో మెండోరా, బుస్సాపూర్ గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించారు. రైతు వేదిక కరెంట్ బిల్లులను ఏఈవోలు గతంలో బిల్లులు చేసి చెల్లించేవారు. కాని ప్రస్తుతం కరెంట్ బిల్లులకు సంబంధించిన బడ్జెట్ రాకపోవడంతో బిల్లులు పేరుకు పోయాయి. దీంతో ట్రాన్స్‌కో అధికారులు బిల్లులు చెల్లించాలని పలుమార్లు అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో కరెంట్ సరాఫరాను నిలిపేస్తున్నారు. కరెంట్ సరఫరా లేకపోతే వీసీలు ఎలా నిర్వహిస్తారు.. సీజన్ ప్రారంభంలో పంటల సాగుపై మెలకువలు ఎలా నేర్చుకుంటారని ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అన్ని రైతు వేదికల్లో ఇలాంటి పరిస్థితే ఉండటం విచారకరం.



విద్యుత్ సరఫరా నిలిపేసిన రెంజర్ల రైతు వేదిక

బడ్జెట్ రాలేదు

కరెంట్ బిల్లుల కోసం ఏడీ కార్యాలయానికి బడ్జెట్ వస్తే అందులో నుంచి ఏఈవోలు బిల్లు చేసి చెల్లించేవారు. ఇప్పటి వరకు ఎలాంటి బడ్జెట్ రాలేదు. దీంతో కరెంట్ బిల్లులు చెల్లించలేకపోయాం. విద్యుత్ సరఫరాను నిలిపి వేయకుండా ట్రాన్స్‌కో అధికారులకు విన్నవిస్తాం.

– బద్దం లావణ్య, ఏవో, బాల్కొండ

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జనరల్ ఆస్పత్రిలో అందించే ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం జనరల్ ఆస్పత్రి నిర్మాణం కోసం భూమి పూజ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. లయన్స్ ఆస్పత్రి ఆవరణలో గల ఒక ప్రభుత్వ భవనాన్ని కేటాయించామని, అదనపు గదులు అవసరమవుతాయని క్లబ్ సభ్యులు తెలపడంతో రూ.15 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. వైద్య సేవలు అందించడానికి రూ.100 ఫీజు మాత్రమే తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహె ర్‌బిన్ హందాన్, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, లయన్స్ క్లబ్(బోధన్) ప్రతినిధులు బసవేశ్వర్‌రావ్, నర్సింహారెడ్డి, లక్ష్మి, నాగేశ్వర్‌రావ్, తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి మార్కులు.. అభినందనీయం

బోధన్‌టౌన్(బోధన్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బోధన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి మార్కులు సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ప్రతిభా అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి అవార్డులను అందజేశారు. ఎంఈవో నాగయ్య, ఏసీపీ శ్రీనివాస్, ట్రాస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిశోర్‌కుమార్, పట్టణ అధ్యక్షులు హరికృష్ణ, ప్రతినిధులున్నారు.



జనరల్ ఆస్పత్రి భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

జూలై ఆఖరి వరకు నీరందిస్తాం

మాక్లూర్: గుత్ప ఎత్తిపోతల పథకం నీరుతో ఎల్లప్పుడూ నిండుగా ఉండే ధర్మోరా చెరువును ఆధారంగా చేసుకుని నిర్మితమవుతున్న బొంకన్‌పల్లి మినీ ఎత్తిపోతల పనులను త్వరగా పూర్తి చేయాలని బొంకన్‌పల్లి, ముల్లంగి (బి) గ్రామాల రైతులు జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఇరిగేషన్ అధికారులను కలిసి విన్నవించారు. పనులు 75 శాతం పూర్తి చేసి మిగితా 25 శాతం పనులు నిలిచిపోయి సంవత్సరం గడుస్తున్నా పనులు ప్రారంభించటం లేదెందుకని ఇరిగేషన్ అధికారులను రైతులు ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితం వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు నిలిచిపోయిన మాట నిజమని, ప్రస్తుతం బిల్లులు చెల్లించామని.. రెండు రోజుల్లో పనులు ప్రారంభించి ఈ సంవత్సరం జూలై 15 వరకు నీరు అందిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందిన రైతులు ఇరిగేషన్ అధికారులను సన్మానించారు. రైతులు రవిప్రకాష్, బూరోల్ల అశోక్, ప్రమోద్, తదితరులున్నారు.



ఇరిగేషన్ అధికారితో మాట్లాడుతున్న ముల్లంగి (బి), బొంకన్‌పల్లి రైతులు

లింబాద్రి నర్సింహ స్వామిని దర్శించుకున్న దిల్ రాజు



మోర్తాడ్: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు కుటుంబ సమేతంగా సోమవారం భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్ట నర్సింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దిల్ రాజు దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు.

వామ్మో... హెచ్‌ఎం బాధ్యత మాకొద్దు !

- కిసాన్‌నగర్‌లో పీజీ హెచ్‌ఎం పదవీ విరమణ
- ఉన్న స్టాఫ్‌లో హెచ్‌ఎం బాధ్యత తీసుకోవడానికి నిరాకరణ
- ఎంఈవోకే ఇన్‌చార్జి హెచ్‌ఎం బాధ్యత

బాల్కొండ: కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పోస్టు ఇన్‌చార్జి బాధ్యత అంటేనే ఉపాధ్యాయులు జంకుతున్నారు. దీంతో బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్‌కు కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి బాధ్యతను విద్యాశాఖ ఉన్నత అధికారులు అప్పగించారు. దీంతో ఉపాధ్యాయులు.. ఎంఈవోకు ఇన్‌చార్జి హెచ్‌ఎం బాధ్యతలా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాలకు 2023–24 చివరిలో పీజీ హెచ్‌ఎంగా రాజేంద్ర ప్రసాద్ వచ్చారు. గత విద్యా సంవత్సరం చివరన ఏప్రిల్ 30, 2025న పదవీ విరమణ పొందారు. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు, ఇద్దరు క్లర్కులు, ఒక అటెండర్ ఉన్నారు. పీజీ హెచ్‌ఎం మరొకరు వచ్చే వరకు ఉన్నా ఏడుగురు ఉపాధ్యాయులలో సీనియర్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. అలా ఏడుగురిలో ఒకరు ఇన్‌చార్జి తీసుకోవడానికి ముందుకు రాలేదు. దీంతో ఎంఈవో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా రావాల్సిన దుస్థితి ఏర్పడింది. పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య కోల్డ్ వార్ ఉండటం వల్లే ఇలాంటి సమస్య ఉత్పన్నమైనదనే విమర్శలున్నాయి.



ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా సీఎం వ్యాఖ్యలు

వేల్పూర్: ఓడ ఎక్కేదాక ఓడ మల్లన్న, ఓడ ఎక్కినాక బోడి మల్లన్న మాదిరిగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. నాడు ఓట్ల కోసం ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చి, గద్దెనెక్కిన తర్వాత అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే పీఆర్సీ, ఎన్ని డీఏలు పెండింగ్‌లో ఉంటే అన్ని డీఏలు, 317 జీవో బాధితులకు 48 గంటల్లో న్యాయం చేస్తా, పెన్షనర్ల బకాయిలు చెల్లిస్తా అని హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకనాడేమో తెలంగాణ ఆర్థికంగా బలంగా ఉందని మాట్లాడి, ఇప్పుడేమో దివాళా తీసిందంటూ పూటకోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో.. పునర్నిర్మాణంలో ఉద్యోగుల పాత్ర మరువలేదని, వారికి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ప్రశాంత్‌రెడ్డి(ఫైల్)

'పంట మార్పిడితో సుస్థిర ఆదాయం పొందొచ్చు'

రుద్రూర్: రైతులు పంట మార్పిడి చేయడం వల్ల సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చునని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కృష్ణ చైతన్య, మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం కో- ఆర్డినేటర్ అనిల్ రెడ్డి సూచించారు. పోతంగల్ మండలం పాత పోతంగల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వారు పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు చేశారు. మొక్కజొన్నలో జంట చాళ్ల పద్ధతిలో బిందు సేద్యం ద్వారా సాగు చేసి నీటిని ఆదా చేయవచ్చునని వివరించారు. ఏవో బి.నిశిత, ఏఈవోలు హన్మంతు, ఎం.సుప్రియ, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ ఎంపీపీ పవన్, రైతులు పాల్గొన్నారు.

యూరియా తక్కువగా వాడాలి

వర్ని(మోస్రా): తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మంజు భార్గవి సూచించారు. సోమవారం మోస్రాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అవసరం మేరకు రసాయన ఎరువులు వినియోగించి నేలను కాపాడాలని కోరారు. శాస్త్రవేత్తలు సాయిచరణ్, దుర్గారాణి, ఏవో రాజశేఖర్, ఏఈవో సప్తగిరి పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానం వాడాలి

ఆర్మూర్: సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి అధిక దిగుబడులు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అడ్వైజరీ కమిటీ మెంబర్ కోటపాటి నర్సింహ నాయుడు సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా పిప్రిలో రుద్రూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంట మార్పిడి విధానాన్ని అవలంభించి దిగుబడి పొందవచ్చన్నారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వీరాస్వామి మాట్లాడుతూ.. కొత్త వంగడాలను సాగు చేయాలని, శాస్త్రవేత్తలు తెలియజేస్తున్న సాంకేతిక విషయాలను అవలంబించాలని రైతులకు సూచించారు. కేవీకే ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ టి. అంజయ్య మాట్లాడుతూ.. అధిక రసానిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు.ఏవో హరికృష్ణ, శాస్త్రవేత్తలు స్వప్న, బీవీ రాజ్ కుమార్, ఎం. శ్వేత, విజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ హేమంత్‌రెడ్డి, శాస్త్రవేత్త నిషికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలి

బాల్కొండ: పంటలో అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్త రాకేశ్ అన్నారు. సోమవారం ముప్కాల్ మండలం రెంజర్లలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..తక్కువ రసాయనాలును వినియోగిస్తూ నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కామారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్‌నాదన్, ఏవో సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పోతంగల్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త కృష్ణ చైతన్య



మోస్రాలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మంజు భార్గవి

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

ఆర్మూర్‌టౌన్: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించాలని ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిలు అన్నారు. మామిడిపల్లిలోని సాయిఫంక్షన్‌హాల్‌లో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో పార్టీ మండల, పట్టణ నూతన అధ్యక్షులను నియమించుకొని పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఏబీ చిన్నా, నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి

బాధితుడికి డబ్బులు అప్పగింత



రుద్రూర్: 'గూగుల్ పే' యాప్‌లో పొరపాటుగా ఇతరులకు పంపిన డబ్బులను పోలీసులు రికవరీ చేసి బాధితునికి అప్పగించారు. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లికి చెందిన చింతల ముత్యాలు గత నెల 15న గూగుల్ పేలో ఒక నంబర్‌గా తప్పుగా ఎంటర్ చేయడంతో రూ.10 వేలు ఇతరు ల ఖాతాలో జమయ్యాయి. బాధితుడు ఎంక్వైరీ చేసి రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామానికి చెందిన నర్సింలు ఖాతాలో డబ్బులు జమైనట్టు తెలుసుకుని రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించా డు. ఎస్సై సాయన్న సోమవారం నర్సింలును పిలిపించి బాధితునికి డబ్బులు ఇప్పించాడు.

వివరాలు నమోదు చేసుకోవాలి

కమ్మర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే ఉద్దేశంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కమ్మర్‌పల్లి ఏవో రమ్యశ్రీ తెలిపారు. సోమవారం కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, ఉప్లూర్, కోనసముందర్ రైతు వేదికల్లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ప్రారంభించారు. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. రైతులు తమ భూముల వివరాలను ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌లతో పాటు ఆధార్‌తో అనుసంధానం అయిన మొబైల్ నంబర్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లెపు వెంకటేష్ డిమాండ్ చేశారు. చేపూర్‌లో సీపీఎం జెండావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి ఆయన మాట్లాడారు. చట్టాల రద్దును డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సదమస్తుల అశోక్, కుతాడి ఎల్లయ్య, ఆటో డ్రైవర్లు నర్సయ్య, మోహన్, పోషన్న, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



రుద్రూర్ పీహెచ్‌సీలో సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత

రుద్రూర్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత సూచించారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో విధుల నిర్వర్తిస్తున్న సిబ్బంది, రోగుల రిజిస్టర్లను పరిశీలించారు. మందుల నిల్వ వివరాలు తెలుసుకున్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులతో ఓపికగా మాట్లాడి వ్యాధి వివరాలు తెలుసుకోవాలన్నారు. మందులు ఇవ్వడంతో పాటు అవసరమైన పరీక్షలు చేయాలని సూచించారు. వైద్యాధికారిణి అయేషా సిద్దికా, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపాలి

ఆర్మూర్‌టౌన్: కష్టపడి చదివి ప్రభుత్వ కొలువులు సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో గల గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తుందన్నారు. గ్రంథాలయ సేవలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయంలో ఐదు కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, గ్రంథాలయ పాలకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న అంతరెడ్డి రాజారెడ్డి

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

గడ్కరీ చిత్రపటానికి పాలాభిషేకం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలో వంతెన కోసం రూ.42 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, నేతలు ముస్కు నర్సయ్య, విక్రమ్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి వంట పాత్రల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన వంట పాత్రలను హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. 22 పాఠశాలలకు వంట చేయడానికి, వడ్డించడం కోసం పాత్రలను అందజేశారు. ఎంఈవో ఆంధ్రయ్య, సీఆర్పీలు అంజయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మర్కజ్ కమిటీ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడిగా అబ్దుల్ అజీమ్, వైస్ ప్రెసిడెంట్ మెహమ్మద్ అసిఫ్, క్యాషియర్ ఇనాయత్ ఎన్నిక కాగ మజీద్ ఇమామ్ ముకీమ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

పోతంగల్ పీహెచ్‌సీలో యోగా తరగతులు

రుద్రూర్: పోతంగల్ పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహిస్తున్న యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యురాలు రాధిక అన్నారు. సోమవారం డాక్టర్ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా ఉదయం, సాయంత్రం యోగ తరగతులు నిర్వహిస్తున్నారని, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఇద్దరు యోగ శిక్షకులను నియమించినట్లు తెలిపారు. ఉదయం పురుషులకు, సాయంత్రం మహిళలకు యోగాసనాలు నేర్పిస్తున్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: విద్యార్థులకు కేజీబీవీలో నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాజాగంగారాం అన్నారు. పెర్కిట్ కేజీబీవీలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును కేజీబీవీ జీఈవోసీవో భాగ్యలక్ష్మి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈనెల 20 వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపులో డ్యాన్స్, మ్యూజిక్, పెయింటింగ్, యోగా, కంప్యూటర్ సిల్క్స్, స్పీడ్ మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లీస్ అంశాలలో ఇస్తున్న శిక్షణను విద్యార్థులు బాగా నేర్చుకోవాలన్నారు.

రుద్రూర్‌లో ఈ నెల 10 నుంచి..

రుద్రూర్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 10 నుంచి 24 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యార్థులకు సమ్మర్ కాంపు నిర్వహించనున్నట్లు ఎంఈవో కట్ట శ్రీనివాస్ తెలిపారు. క్యాంపులో ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు డాన్స్, యోగ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూజిక్ నేర్పుతారని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తులను కోర్సు డైరెక్టర్‌కు అందజేయాలని సూచించారు.